క్లుప్తంగా

సీపీఐ ప్రజాగర్జన పోస్టర్ల ఆవిష్కరణ



బాన్సువాడ: భద్రాద్రి కొత్తగూడెంలో వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్న ప్రజాగర్జనకు సంబంధించిన పోస్టర్లను సీపీఐ నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కార్మికులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దుబాస్ రాములు, నవీన్, గంగాధర్, పరువయ్య, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్.. కుక్కలు



కామారెడ్డి రూరల్: మండలంలోని చిన్నమల్లారెడ్డి పరిధిలోని గురురాఘవేంద్ర కాలనీలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో రాత్రిపూట ఒక్కరే బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడ్డా కుక్కల భయానికి బయటకు రావడం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

పదవీ కాలం పొడిగింపు



మహేందర్‌రెడ్డి

భిక్కనూరు: భిక్కనూరు శ్రీసిద్ధరామేశ్వరాలయం పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి పదవీ కాలాన్ని రెండేళ్ల పొడిగిస్తూ దేవాదాయ శాఖ కార్యదర్శి అనిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తనకు మరోసారి అవకాశ కల్పించిన ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు మహేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోనే అతి పెద్ద శివాలయంగా పేరున్న సిద్ధరామేశ్వర ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని వెల్లడించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



పిట్లం: మండలంలోని రాంపూర్ గ్రామం ఎస్సీ కాలనీలో ఆదివారం సర్పంచ్ నారాయణరెడ్డి నూతన బోరు మోటర్‌ను పారంభించారు. తాగునీటి కోసం ఇక ఇబ్బందులు తలెత్తవని పేర్కొన్నారు.

హజ్ యాత్రికులను సన్మానించిన ఎమ్మెల్యే



బిచ్కుంద: హజ్ యాత్రకు వెళ్తున్న వారిని ఆదివారం ఎమ్మెల్యే హన్మంత్ సింధే సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలు పవిత్రంగా భావించే మక్కా యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో మైనారిటీలకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు.

మొక్కలు పెంచాలి



పెద్దకొడప్‌గల్: మొక్కలు పెంచడం ప్రతి ఒక్కరూ భాధ్యతగా తీసుకోవాలని ఎస్సై కొనారెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై తన సిబ్బంది రాజు, వెంకట్, శ్రీనివాస్, బందగిసా, మురళీతో కలిసి మొక్కలను నాటారు.

స్టేడియంకు నిధులు..

క్రీడాకారుల్లో ఆనందం..

- సాకారం కానున్న 30 ఏళ్ల కల
- పనులు పూర్తయితే ఎంతో ప్రయోజనం



నిధుల మంజూరు ప్రతిని అందజేస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్



స్టేడియం కోసం కేటాయించిన స్థలం

తాడ్వాయి: మండల కేంద్రమైన తాడ్వాయిలో అర్ధాంతరంగా ఆగిపోయిన మినీ స్టేడియం నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ. 2.50 కోట్లు మంజూరు చేసింది. నిధుల మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే జాజాల సురేందర్ స్థానికులకు అందజేశారు. దీంతో 30 ఏళ్ల కలకు సాకారమైంది. గ్రామ పెద్దలు స్థానిక శబరిమాత ఆశ్రమం సమీపంలో ఊరగట్టుపై స్టేడియం కోసం చందాలు వేసుకొని 5 ఎకరాల భూమిని కొనుగోలు చేసి ప్రభుత్వం పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో అప్పట్లో మినీ స్టేడియం నిర్మాణం కోసం తూతూమంత్రంగా ప్రభుత్వం రూ.14 లక్షలు మంజూరు చేయడంతో గదలు నిర్మాణానికి బేస్మెంట్‌తో పాటు స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేశారు. ఆ తర్వాత వాటి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. మండలంలోని వివిధ గ్రామాల్లో 500 మంది క్రీడాకారులు ఉన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ క్రీడల్లో పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపారు. దీంతో క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గ్రామ పెద్దలు స్టేడియం నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని పలుమార్లు ఎమ్మెల్యేలు, ఎంపీల దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుత ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని స్థానికులు తెలిపారు. మంజూరైన నిధులతో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టులు, స్విమ్మింగ్, అథ్లెటిక్స్ కోసం అవసరమైన వసతుల ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

క్రీడాకారులకు ప్రయోజనం



స్టేడియం కోసం నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే సురేందర్‌కు కృతజ్ఞతలు. పనులు పూర్తయితే క్రీడాకారులకు ఎంతో ప్రయోజనం కల్గుతుంది.

– ముదాం నర్సింలు, వైస్ ఎంపీపీ, తాడ్వాయి

నిధుల మంజూరు అదృష్టం



స్టేడియం కోసం నిధులు మంజూరు చేయించడం ఈ ప్రాంత క్రీడాకారుల అదృష్టం. 30 ఏళ్ల కల నెరవేరింది.

– బండారి సంజీవులు, సర్పంచ్, తాడ్వాయి

మరింత రాణిస్తా



స్టేడియం ఏర్పాటైతే కష్టపడి వాలీబాల్‌లో మరింత రాణిస్తా. ఇన్నాళ్లు పాఠశాల ఆవరణలోనే ప్రాక్టీస్ చేస్తూ జాతీయ స్థాయిలో రాణించాను. మరింత కష్టపడతా.

– సాయికుమార్, వాలీబాల్ క్రీడాకారుడు

సంతోషంగా ఉంది



నిధులు మంజూరు కావడం సంతోషంగా ఉంది. గ్రామ పెద్దల సహకారం మరువలేం. మరింత కష్టపడి క్రీడల్లో రాణిస్తా.

– యోగేష్ రావు, వాలీబాల్ క్రీడాకారుడు

ఇన్నాళ్లూ ఇబ్బంది పడ్డాం



సరైన క్రీడామైదానం లేక ఇన్నాళ్లు ఇబ్బంది పడ్డాం. స్టేడియం పనులు పూర్తయ్యాక రోజూ ప్రాక్టీసు చేసి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటా.

– నవీన్, కబడ్డీ క్రీడాకారుడు

రోజూ ప్రాక్టీసుకు అవకాశం



స్టేడియం నిర్మాణ పనులు పూర్తయ్యాక రోజూ ప్రాక్టీసు చేసుకునే అవకాశం దక్కనుంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీల్లో ప్రతిభ చూపుతాననే నమ్మకం కల్గింది.

– చందు, కబడ్డీ క్రీడాకారుడు

రాష్ట్రంలో కర్ణాటక తరహా ఫలితాలు



షబ్బీర్ అలీకి స్వాగతం పలుకుతున్న నాయకులు

భిక్కనూరు: బీజేపీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కర్ణాటక తరహా ఫలితాలు వస్తాయని కాంగ్రెస్‌కు చెందిన మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన భిక్కనూరులో నిర్వహించిన యువజన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది నెలల్లో తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ నిరంకుశ పాలనతో విముక్తి కలుగబోతోందన్నారు. అకాల వర్షాలకు పంట నష్ట పోయిన రైతులకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వం తెప్పించుకుందే తప్ప పరిహారం ఇవ్వలేదన్నారు. పంట 33 శాతం కంటె ఎక్కువ నష్టం జరిగితేనే పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం నిబంధనలను విధించడం శోచనీయమన్నారు. అభివృద్ధి అంటే రోడ్లు, మురికి కాలువలు ఒక్కటే శుభ్రం చేయడం కాదని ఆరోపించారు. దళితులకు భూ పంపిణీ పథకం గురించి సీఎం కేసీఆర్ ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. సమావేశంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు యెల్మల విజయ్, ధర్మయ్య, సిద్దగౌడ్ అందే దయాకర్‌రెడ్డి, కొట్టని స్వామి, మద్దురి రవి, కల్లురి సిద్ధరాములు పాల్గొన్నారు.

పేస్కేల్ కోసం ఒక్కతాటిపై నడవాలి



మాట్లాడుతున్న కామారెడ్డి జేఏసీ చైర్మన్ కృష్ణాగౌడ్

కామారెడ్డి రూరల్ : ఉపాధి హామీ ఉద్యోగుల పేస్కేల్ సాధన కోసం ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని కామారెడ్డి జేఏసీ చైర్మన్ సరంపల్లి కృష్ణాగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి ఉపాధి హామీ ఉద్యోగుల సాధన సమావేశంలో మాట్లాడారు. ఉపాధిహామీ ఉద్యోగులకు పేస్కేలు సాధించేవరకు విశ్రమించేది లేదన్నారు. ప్రభుత్వానికి అన్ని రకాలుగా సహకరిస్తూనే ఉద్యోగుల సమస్యల కోసం జేఏసీ పోరాడుతుందన్నారు. పేస్కేల్ సాధన విషయమై జేఏసీ తీవ్రంగా శ్రమిస్తుందని త్వరలో ఉపాధి ఉద్యోగులకు సైతం పేస్కేల్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా 4,000 మంది కుటుంబాలు ఎదురు చూస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ఉపాధిహామీ పథకంలో కూలీల కోసం ప్రభుత్వం కోసం మరింత ఎక్కువగా శ్రమిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర జేఏసీ చైర్మన్ లింగయ్య, కో కన్వీనర్లు వెంకట్రామిరెడ్డి, అంజిరెడ్డి, మోహన్ రావు, మల్లారెడ్డి, రమేష్, శ్రీనివాస్, ధనుంజయ్, రాజశేఖర్ రెడ్డి, రేణుక, మమత, గంగాధర్, రాజేశ్వర్, శేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



కామారెడ్డి రూరల్: మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామం రాజంపేట రోడ్డు నుంచి తిమ్మక్‌పల్లి రోడ్డు వరకు రూ.45 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టగోని గోపిగౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నబాయి ఆనంద్‌రావు, సింగల్ విండో వైస్ చైర్మన్ శంకర్ గౌడ్, ఎంపీటీసీలు బీమాయ్యల రాజు నీలమ్మ, కమ్మరి అనంతలక్ష్మి శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ కమ్మరి లక్ష్మి నారాయణ, పీఆర్ ఏఈ ఆదిత్య రెడ్డి పాల్గొన్నారు.

ఓట్ల కోసమే ఆత్మీయ సమ్మేళనాలు



ప్లీనరీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీజేఎస్ ఎల్లారెడ్డి ఇన్‌చార్జి నిజ్జన రమేశ్

లింగంపేట: ఓట్ల కోసమే బీఆర్‌ఎస్ నేతలు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారని తెలంగాణ జన సమితి (టీజేఎస్) ఎల్లారెడ్డి నియోజక వర్గం ఇన్‌చార్జి నిజ్జన రమేశ్ ఆరోపించారు. ఆదివారం ఆయన సూర్యాపేటలో వచ్చే నెల 4న నిర్వహించనున్న టీజేఎస్ ప్లీనరీ పోస్టర్లను ఆవిష్కరించారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మన్, పూల్‌సింగ్, రవికుమార్, తిర్మలేష్, గోపాల్, లక్ష్మన్, పోచయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

■ వైభవంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన



నిజాంసాగర్: మండలంలోని బ్రహ్మణపల్లి అంజనాద్రిక్షేత్రం ఆవరణలో ఆదివారం నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమం నిర్వహించారు. విగ్రహదాత ఉదయ్‌కుమార్ దంపతులు, కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త పట్లోళ్ల కిశోర్ కుమార్ పాల్గొన్నారు.

■ హనుమాన్ మందిరంలో సంప్రోక్షణ

నాగిరెడ్డిపేట: మండలంలోని చీనూర్ హనుమాన్ మందిరంలో సంప్రోక్షణ కార్యక్రమం సందర్భంగా హోమం జరిపించారు. తొగిట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామిజీ ఆధ్వర్యంలో సంప్రోక్షణ చేశారు.



■ ఆలయానికి పోటెత్తిన భక్తులు..



మాచారెడ్డి: మండలంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శనిగరం కమలాకర్ రెడ్డి, ఈవో ప్రభు, రామ్‌చంద్రం, అర్చకులు శ్రీనివాస చార్యులు, నరసింహ చార్యులు, పరందమాచార్యులు, సంజీవ చార్యులు, సిబ్బంది సంతోష్, స్వామి పాల్గొన్నారు.

■ ఎల్లమ్మ ఆలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు



నిజాంసాగర్: మండలంలోని కొమలంచ గేటు వద్ద ఉన్న ముంతల ఎల్లమ్మ ఆలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, నాయకులు నారాయణరెడ్డి, జీవన్, నరేశ్‌పటేల్, సాయిలు, అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్



లింగంపేటలో మాట్లాడుతున్న ఎంపీ బీబీ పాటిల్

లింగంపేట: నలభై ఏళ్లలో జరగని అభివృద్ధి నాలుగేళ్లలో చేసి చూపించామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ వెల్లడించారు. ఆదివారం లింగంపేటలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు వేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా తీర్చేందుకు అందుబాటులో ఉంటున్నట్లు తెలిపారు. వచ్చే ఐదు నెలలు మరింత కష్టపడి అధికారంలోకి వస్తామని వెల్లడించారు. ప్రతి గ్రామానికి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే సీఎం కేసీఆర్ లక్ష్యం అని అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనతో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో మంత్రి హరీష్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, ఎంపీపీ గరీబున్నిసాబేగం, సర్పంచ్ బొల్లు లావణ్య, జెడ్పీటీసీ శ్రీలత, మండల పార్టీ అధ్యక్షుడు దివిటి రమేశ్ పాల్గొన్నారు.

అబద్ధపు మాటలు తిప్పికొట్టాలి

లింగంపేట: సంక్షేమం అభివృద్ధే బీఆర్‌ఎస్ లక్ష్యం అని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఆదివారం ఆయన లింగంపేటలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు చేస్తున్న అబద్ధపు మాటలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ 60 ఏళ్ల పాలనలో తాగునీటి కోసం అల్లాడిన రోజులు లేవా అని గుర్తు చేశారు. అంతకుముందు శెట్పల్లి చౌరస్తా నుంచి నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన



హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న నాయకులు



మంత్రికి మొక్కను అందజేస్తున్న కలెక్టర్

నాగిరెడ్డిపేట: మండలంలోని లింగంపల్లికలాన్ గ్రామం వద్ద పోచారం కాలువపై వంతెన నిర్మాణానికి ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి రైతులతో మాట్లాడుతూ అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మంత్రికి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు ఎస్పీ అనోన్య స్వాగతం పలికారు. ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే జాజాల సురేందర్, జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, ఏఎంసీ చైర్మన్ నారాయణ, ఎంపీపీ రాజ్‌దాస్, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, నీటి పారుదల శాఖ సీఈ శ్రీనివాస్ ల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

■ ఆర్యవైశ్య సంఘం కమిటీ ఎన్నిక..



కామారెడ్డి టౌన్: కామారెడ్డి పెద్ద బజార్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా గరిపల్లి శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా మెతుకు శ్రీనివాస్, కోశాధికారిగా మోట్కూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎల్లంకి రమేష్, ఉప కార్యదర్శిగా రెనికుంట రాజును ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

■ కాంగ్రెస్ మైనారిటీ, ఎస్సీ సెల్ అధ్యక్షుల నియామకం



ఎల్లారెడ్డి: మైనారిటీ, ఎస్సీ సెల్ విభాగాలకు మండల అధ్యక్షులను నియమించినట్లు పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి తెలిపారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఎస్సీ సెల్ విభాగంలో నాగిరెడ్డిపేటకు సాయిలు, లింగంపేటకు మన్నె నరేష్, తాడ్వాయికి గడ్డరాజు, గాంధారికి చీమన్ సాయిలు, సదాశివనగర్‌కు భూపెల్లి నవీన్‌ను నియమించారు. మైనారిటీ సెల్ విభాగానికి ఎల్లారెడ్డి మండలానికి యూనుస్, లింగంపేటకు ఇస్మాయిల్, గాంధారికి బషీర్, తాడ్వాయికి గఫూర్, సదాశివనగర్‌కు గౌస్, నాగిరెడ్డిపేటకు షహీద్ అఫ్రీద్‌ను నియమించినట్లు తెలిపారు. జిల్లా ఎస్సీ, మైనారిటీ సెల్ అధ్యక్షులు బాగయ్య, కలిక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అఫీజ్ పాల్గొన్నారు.

■ గౌడ సంఘం..

బీబీపేట: మండల గౌడ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సిద్ధాగౌడ్, అధ్యక్షుడిగా తంగళ్లపల్లి కాశాగౌడ్, ఉపాధ్యక్షులుగా ముస్తాబాద్ సిద్ధాగౌడ్, సైదుగారి శంకర్‌గౌడ్, వేముల సాయాగౌడ్, ప్రధాన కార్యదర్శిగా జంగం భూమాగౌడ్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శిగా ధర్మగారి దుబ్బాగౌడ్, బాయికాడి శంకర్‌గౌడ్, కోశాధికారిగా రాజగోని లింగాగౌడ్‌ను ఎన్నుకున్నారు.



దివంగత సీఎం ఎన్టీఆర్‌కు నివాళి



నస్రుల్లాబాద్‌లో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నేతల నివాళి

నస్రుల్లాబాద్: మండల కేంద్రమైన నస్రుల్లాబాద్‌లో ఆదివారం ఉమ్మడి రాష్ట్ర సీఎం ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రిగా ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అరిగె సాయిలు, నర్సింలు గౌడ్, రాంబాబు, రమణ, సత్యనారాయణ, సాయలు, నరేష్ పాల్గొన్నారు.

టీడీపీ మహానాడుకు వెళ్లిన నాయకులు

ఎల్లారెడ్డి: నియోజవర్గానికి చెందిన పలువు టీడీపీ నాయకులు ఏపీలోని రాజమహేంద్రవరంలో జరుగుతున్న మహానాడుకు తరలి వెళ్లారు. నియోజక వర్గం ఇన్‌చార్జి మహేష్, నాయకులు రాజు, సర్దార్, మల్లేష్ తదితరులు వెళ్లినవారిలో ఉన్నారు.

కామారెడ్డి రూరల్: ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి ఆదివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టగోని గోపిగౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల కోసం ఎన్టీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గూడెం బాల్‌రాజు, దంతెపల్లి స్వామి, పూసల శ్రీనివాస్, అనిల్‌రెడ్డి, బీమయ్యల రాజు పాల్గొన్నారు.

సంక్షిప్తం

బీఆర్‌ఎస్ జెండా గద్దె కూల్చివేత

కామారెడ్డి క్రైం: పట్టణంలోని హరిజనవాడ చౌరస్తాలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ జెండాకు సంబంధించిన గద్దెను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. కౌన్సిలర్ రాజు, బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి: మండల కేంద్రంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్ లేని వారికి జరిమానా విధించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

బాన్సువాడ రూరల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పీసీసీ నాయకులు కూనిపూర్ రాజిరెడ్డి, అడ్వకేట్ వెంకట్ రాంరెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు ప్రతాప్‌సింగ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఆదివారం హన్మాజీపేట్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు సంజీవ్, వెంకాగౌడ్, విఠల్ పటేల్, చందర్‌నాయక్, అక్తర్‌సాబ్, నసీం, తులసీరాం, సాయిలు, అహ్మద్, భూంరెడ్డి, రాజేశ్వర్, లక్ష్మయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

కామారెడ్డి రూరల్: మండలంలోని గర్గుల్ గ్రామ వాగులో పడి ఇటీవల మృతి చెందిన పోచయ్య కుటుంబానికి సర్పంచ్ చింతల రవితేజ గౌడ్ ఆర్థిక సహాయం అందించారు. అంత్యక్రియల నిర్వహణకు ఆర్థిక సహాయం అందజేశారు.

పోలీసుల అదుపులో బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిరూరల్: మండలంలో బీజేపీ నాయకులను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఎల్లారెడ్డిలో మంత్రి హరీశ్‌రావు పర్యటన సందర్భంగా బీజేపీ నాయకులు విద్యాసాగర్, ప్రశాంత్‌గౌడ్, గోపి, సాయిబాబా, నరేష్‌ను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

34వ రోజుకు చేరిన రిలే దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే విషవాయుకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తూ కాచాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 34 రోజుకు చేరుకున్నాయి. ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నా అధికారులు స్పందించక పోవడం బాధాకరం అన్నారు.